
సాక్షి
పల్నాడు
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



గుర్రం జాషువాకు నివాళి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు, షేక్ నూరిఫాతిమా శుక్రవారం గుర్రం జాషువా సమాధి వద్ద నివాళులర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు కానుకగా హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు విస్సన్నపేటకు చెందిన జి.వెంకటరెడ్డి దంపతులు రూ.2 లక్షల విలువైన బంగారు హారాన్ని బహూకరించారు.

న్యూస్‌రీల్

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మే 2న హాజరుకానున్న ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, జేసీ భార్గవ్‌తేజ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

చెలరేగిన మృగాడు

- భార్యపై అనుమానంతో బ్లేడుతో గొంతు కోసిన భర్త
- క్రోసూరులో దారుణం



క్రోసూరు: స్థానిక బోయ కాలనీలో భార్యపై అనుమానం పెంచుకుని భర్త బ్లేడుతో గొంతుకోసిన సంఘటన శుక్రవారం జరిగింది. స్టేషన్ రైటర్ దాసు వివరాల ప్రకారం.. బోయ కాలనీకి చెందిన చార్ల శ్రీను భార్య మల్లమ్మ. ఆమె ఎవరితోనో ఫోనులో మాట్లాడుతుండటంతో అనుమానపడి శ్రీను బ్లేడుతో దాడి చేసి గొంతు కోశాడు. చుట్టపక్కల వారు ఆమెను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు 25 కుట్లు వేశారు. ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. శ్రీను, మల్లమ్మలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కూడా అయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైటర్ దాసు తెలిపారు.

డాక్టరేట్ పొందిన ఆటో డ్రైవర్ శంకర్‌రావుకు అభినందనలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూనే కాలికట్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందిన గండికోట శంకర్‌రావును ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య సత్కరించారు. శుక్రవారం స్థానిక పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్ .లక్ష్మయ్య మాట్లాడుతూ గండికోట శంకరరావు ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు పాల్గొన్నారు.

21న చీరాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చీరాల మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజల సౌలభ్యం కోసం చీరాల నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పాక్ జలసంధిని ఈదిన గణేష్



విజయవాడస్పోర్ట్స్: తమిళనాడులోని ధనుష్‌కోటి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్ వరకు ఉన్న పాక్ జలసంధిని ఆంధ్రప్రదేశ్ పారా స్విమ్మర్ బి.గణేష్ సాహసోపేతంగా ఈదాడు. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు తలైమన్నార్‌లో ఈతను ప్రారంభించి సాయంత్రం 4.20కి ధనుష్‌కోటికి చేరుకున్నారు. 28 కిలోమీటర్లు పొడవున్న సముద్రాన్ని 10.30 గంటల్లో ఈదాడు. తెలుగు రాష్ట్రాల్లోని పారా స్విమ్మర్లలో పాక్ జలసంధిని ఈదిన మొట్టమొదటి పారా స్విమ్మర్‌గా ఖ్యాతిగడించారు. స్విమ్మర్ గణేష్ ప్రస్తుతం ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు.

ఏసు రక్తంతో పాప విముక్తి



జగ్గాపురం రోడ్డులో క్రైస్తవుల ర్యాలీ



క్రీస్తు సిలువతో పడ్డ కష్టాలను కల్వరి యాత్రలో ప్రదర్శిస్తున్న వేషధారులు

యడ్లపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కొడవటి సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో శుక్రవారం కల్వరి సిలువ యాత్రను నిర్వహించారు. లింగారావుపాలెం, మైదవోలు, జాలాది, ఉప్పరపాలెం గ్రామాల నుంచి క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్తుతి గీతాలు పాడుకుంటూ క్రీస్తు శ్రమలను కళ్లకు కట్టారు. క్రీస్తు నాడు పడిన కష్టాలను చూసి కన్నీళ్లతో ప్రార్థనలు చేశారు. ఫాదర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఏసు ప్రభువు తన రక్తాన్ని సిలువపై చిందించి పాపాల నుంచి సర్వమానవుల్ని విముక్తి కల్పించారని తెలిపారు.

– యడ్లపాడు

వరుస సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి పెరిగిన రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాంతం, పండుగలు, వేసవి సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన యాత్రికులతో ఉదయం 7 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగగా, ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. నూతన వధూవరులు పెళ్లి దుస్తుల్లో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంతరాలయ దర్శనం రద్దు

రద్దీ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచే అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. రూ.300, రూ.100 టికెట్లను మాత్రమే విక్రయించారు. దీంతో వీఐపీల పేరిట వచ్చే భక్తులతో పాటు సిఫార్సు లేఖలపై వచ్చే వారికి సైతం ముఖ మండప దర్శనం మాత్రమే కల్పించారు. రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో ఆలయంలో రద్దీ మరింత పెరిగింది. రద్దీ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భక్తులు ముందుకు కదిలేలా ఆలయానికి చెందిన వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అంతరాలయ దర్శనాన్ని పునరుద్ధరించారు.

ఆర్జిత సేవలకు డిమాండ్...

చైత్ర మాసం కావడంతో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారు జామున అంతరాలయంలో ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంతో పాటు సాయంత్రం అమ్మవారికి జరిగిన పంచహారతుల సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అయా ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం పల్లకీ సేవ, దర్బార్ సేవల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇరకాటం... పితలాటకం

- జీవో నంబర్- 20తో కుదేలైన నూతన గృహ నిర్మాణ రంగం
- జీవోపై రుసరుసలాడుతున్న యజమానులు, ఎల్‌టీపీలు
- ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు
- సహకరించని ఎల్‌టీపీలు



నిర్మాణంలో ఉన్న కట్టడం

నరసరావుపేట: గత రెండు నెలల నుంచి జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నూతన ఇళ్ల నిర్మాణాల ప్లాన్‌లకు బ్రేక్ పడింది. అంతకు ముందు తీసుకొన్న వారే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అతి ముఖ్యమైన ప్లాన్ మంజూరులో స్వీయ సర్టిఫికేషన్ స్కీం(ఎస్‌సీఎస్)ను ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చింది. మున్సిపల్ లైసెన్స్‌డ్ ఇంజనీర్లుగా పిలవబడే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ)లపై నూతన మార్గదర్శకాలు విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం రెండు నెలల కిందట జీవో నంబర్- 20 తెచ్చింది. ఆ నిబంధనల మేరకు ఎల్‌టీపీలు అప్‌లోడు చేయకపోవడంతో ప్లాన్‌లు అధికారుల ముందుకురాలేదు. గతంలో మున్సిపల్ అధికారులే ప్లాన్ అప్రూవల్ చేసేవారు. ఇందులో అధికారులు లంచాలు గుంజటం, ఇవ్వని వారి ప్లాన్‌లకు ఏదో ఒక కారణం చూపి ఆపేస్తూ జాప్యానికి కారణమవుతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ జీవోను తీసుకొచ్చింది.

ఎల్‌టీపీల చేతిలో అప్రూవల్

ప్లాన్ అప్రూవల్ అధికారం మున్సిపల్ అధికారుల నుంచి తప్పించి ఎల్‌టీపీల చేతిలో పెట్టింది. ప్లాన్ గీసిన వారికే మున్సిపల్ నిబంధనల ప్రకారం అప్రూవల్ చేసే అధికారం ఇచ్చింది. దీనిలో ఎటువంటి అవకతవకలు జరిగినా యజమాని, ఎల్‌టీపీలనే బాధ్యులుగా నిర్ణయించింది. తీసుకున్న ప్లాన్ ప్రకారం నిర్మిస్తామని యజమాని, ఎల్‌టీపీలు స్వీయ సర్టిఫికెట్ అందజేయాలనే నిబంధనలు పెట్టింది. భవన నిర్మాణదారులు తీసుకున్న ప్లాన్‌కు వ్యతిరేకంగా నిర్మాణం చేస్తే , దాన్ని నిలిపివేసే అధికారం ఎల్‌టీపీలకే కట్టబెట్టడంతో పాటు జరిమానా విధించే అధికారం కూడా వారికే ఇవ్వడం గమనార్హం. ఎల్‌టీపీలు పొరపాట్లు చేస్తే వారి లైసెన్స్‌ను ఐదేళ్లపాటు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా ఎదుర్కోవాల్సిన గత్యంతరం దాపురించింది. పురపాలక పరిధిలో లైసెన్స్ తీసుకున్న సుమారు 30మంది ఎల్‌టీపీలు ఎస్‌సీఎస్ చట్టాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఒకసారి ప్లాన్ మంజూరైన తర్వాత యజమాని తమ నియంత్రణలో ఉండరని, వారిని నియంత్రించే శక్తి, నిర్మిస్తున్న భవనాన్ని ఆపే సిబ్బంది తమకు ఉండరని ఎల్‌టీపీలు వాదిస్తున్నారు. దీంతో వారంతా కిమ్మనకుండా కూర్చున్నారు. నూతన నియమాల మేరకు ఎల్‌టీపీల లైసెన్స్‌ల మంజూరుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే వారెవరూ సహకరించకపోవడంతో ప్లాన్‌లు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి చేరడంలేదు. ఈ కారణంగా ఇంటి నిర్మాణాలు ఆగిపోవటంతో యజమానులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒక ప్లాన్ మాత్రమే వచ్చింది



జీవో 20 వచ్చిన తర్వాత పురపాలక పరిధిలో ఒక ప్లాన్ మాత్రమే వచ్చింది. ఎల్‌టీపీలు నూతన మార్గదర్శకాల మేరకు లైసెన్స్ అప్రూవల్ చేసుకోవాలని పిలిచాం. వారి నుంచి స్పందన కూడా లేదు.

-కె.సాంబయ్య, టీపీఓ

మోదీ డౌన్ డౌన్.. బీజేపీ డౌన్ డౌన్



అమరావతిలో ముస్లింల ర్యాలీ

- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ
- రాజకీయ పార్టీలకు అతీతంగా నిరసనలు
- సంఘీభావం తెలిపిన సీపీఎం, ప్రజాసంఘాలు

అమరావతి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలు అమరావతి మెయిన్ రోడ్డులో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మోదీ డౌన్ డౌన్.. బీజేపీ డౌన్ డౌన్ నినాదాలు చేశారు. మెయిన్ రోడ్డులోని మసీదు నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ గాంధీ బొమ్మ సెంటర్, మద్దూరు డౌన్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం నిరసనకారులు తిరిగి మసీదుకు చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ మాట్లాడుతూ ముస్లింల హక్కులను కాలరాసే వక్ఫ్ చట్టాన్ని కూటమి పార్టీలు తప్పా మిగతావన్నీ వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ముస్లింలంతా ఈ చట్టాన్ని ఐకమత్యంగా వ్యతిరేకించి విజయం సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జాని, సీపీఎం నాయకులు రవిబాబు, సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ నేత గోపి, ముస్లిం మత పెద్దలు ముఫ్తి మెజహిదుల్ ఇస్లాం, ముఫ్తి రహమతుల్లా, అబ్దుల్ ఖాదిర సాహెబ్, అబ్దుల గఫార్ సాహెబ్, మౌలానా అబ్దుల్ మస్తాన్, ఫారూక్, జిల్లా అవాజ్ కమిటీ కార్యదర్శి భాషా, స్టూడెంట్ ఇస్లామిక్ అర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి కరీం మొహీద్దీన్ అదాం ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ముస్లింలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెదకూరపాడులో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. భారతదేశంలో ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



పెదకూరపాడులో ర్యాలీ

కప్పం కడితే రైట్ రైట్

- గ్రానైట్‌లో వసూళ్ల దందా
- చినబాబు నెల మామూళ్లు రూ.50 కోట్లు
- అద్దంకి, పర్చూరు పచ్చనేతలకు చెరో రూ.8 వేలు
- రూ.10 వేలు డిమాండ్ చేస్తున్న గురజాల పచ్చనేత
- తనకు రూ.8 వేలు కావాలంటున్న నరసరావుపేట నాయకుడు
- కప్పం కట్టకపోతే సేల్‌టాక్స్, లోకల్ పోలీసులను ఉసిగొల్పుతున్న వైనం
- ఫ్యాక్టరీ యజమానులతో మంత్రి గొట్టిపాటి సమావేశం
- వసూళ్ల విషయం మీరే చూసుకోవాలని ఆదేశం
- తలలు పట్టుకుంటున్న పరిశ్రమల యజమానులు, బయ్యర్లు
- పచ్చ దోపిడీపై సర్వత్రా ఆగ్రహం



బల్లికురవలో గ్రానైట్ క్వారీ


సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి సర్కార్ దోపిడీ శృతిమించి రాగానపడింది. గ్రానైట్ పరిశ్రమల నుంచి పెద్దఎత్తున దండుకునేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. ప్రభుత్వానికి చెల్లించే పన్ను సంగతి దేవుడెరుగు ముందు తమ సంగతి చూడమంటున్నారు. పన్ను ఎగనామం పెట్టినా ఫర్వాలేదు తమకు మాత్రం నెల మామూళ్లు ఇవ్వాల్సిందేనని హుకుం జారీచేశారు. అడిగిన మొత్తం చెల్లించకపోతే రాష్ట్ర సరిహద్దులు దాటినిచ్చేది లేదని బెదిరింపులకు దిగారు. పచ్చనేతల నెల మామూళ్లు ప్రభుత్వానికి చెల్లించే పన్ను కంటే అధిక మొత్తంలో ఉండడంతో బయ్యర్లు బెదిరిపోతున్నారు. కప్పం చెల్లించి వితౌట్(టాక్స్ లేకుండా)లో గ్రానైట్ పంపే దానికంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించి దర్జాగా తీసుకెళ్లడమే మేలని వ్యాపారులు భావిస్తున్నారు.

చినబాబు కప్పం రూ.50 కోట్లు

బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలు, పరిశ్రమల నుంచి నెలకు రూ.50 కోట్లు ఇవ్వాలని చినబాబు జిల్లా గ్రానైట్ మంత్రిని ఆదేశించినట్లు సమాచారం. మంత్రి హుటాహుటిన గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, బయ్యర్లతో సమావేశం పెట్టి వ్యవహారం చక్కబెట్టాలని రెండు జిల్లాల మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మంత్రి ఆదేశాలతో ఇటీవల గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీ యజమానులతో అధికారులు తొలుత సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా మంత్రి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకరిద్దరికైతే కప్పం చెల్లించగలంకానీ పదుల సంఖ్యలో ఉన్న పచ్చనేతలందరికీ నెల మామూళ్లు ఇవ్వడం కుదరదని క్వారీ, పరిశ్రమల యజమానులు తేల్చి చెప్పినట్లు సమాచారం. మీరడిగినంత మొత్తం కట్టలేమని, ఇలాగైతే వ్యాపారమే మానుకుంటామని మరికొందరు వ్యాపారులు ఏకంగా మంత్రికే తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఇలాగైతే బయ్యర్లు పలకలు తీసుకెళ్లేందుకు ఇష్టపడరని అదే జరిగితే వ్యాపారాలు మూత పడతాయని మరికొందరు వ్యాపారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అన్నీ విన్న మంత్రి పైనుంచి వచ్చిన ఆదేశాలు పాటించడం తప్ప తాను చేయగలిగిందేమీ లేదని వ్యాపారులకు తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో మైనింగ్, విజిలెన్స్ అధికారులు మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ప్రకాశం జిల్లా పరిధిలోని చీమకుర్తి ప్రాంతాల్లోని క్వారీలు, ఫ్యాక్టరీలపై దాడులకు దిగారు. పచ్చనేతల తీరుతో విసిగి పోయిన క్వారీ, పరిశ్రమల యజమానులు వితౌట్‌లో మైనింగ్ చేయడం దాదాపుగా మానుకున్నారు. కొందరు మంత్రి అనుచరులకు ముడుపులు చెల్లించి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా గ్రానైట్ తరలిస్తున్నట్లు సమాచారం. పచ్చనేతలకు కప్పం చెల్లించి వ్యాపారం చేయడం కంటే మానుకోవడమే మేలని కొందరు బయ్యర్లు వ్యాపారానికి తాత్కాలికంగా స్వస్తిపలికారు. ఇప్పుడు ఈ విషయం జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. భూగర్భ గనులశాఖలో ఇది మరింత చర్చనీయాంశంగా మారింది.

శృతిమించిన పచ్చనేతల మామూళ్ల దందా

చినబాబు కప్పం వ్యవహారం పక్కనబెడితే స్థానిక పచ్చనేతలంతా గ్రానైట్‌పై పడ్డారు. గ్రానైట్ పాలిషింగ్ పలకలు వితౌట్(టాక్స్ లేకుండా)లో తీసుకెళ్లేందుకు లారీకి ఏఎమ్మార్ టోకెన్‌కు రూ.25 వేలు చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి ఏఎమ్మార్ ఇచ్చే టోకెన్ రూ.8 నుంచి రూ.10 వేలకు మించి ఉండదు. ఇది కాకుండా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు ఉన్న పర్చూరు, అద్దంకి పచ్చనేతలకు వ్యాపారులు నెలకు చెరో రూ.8 వేలు కప్పం కడుతుండగా నరసరావుపేట పచ్చనేత రూ.8 వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇక గ్రానైట్ దందాకు ఆద్యుడైన గురజాల నేత తనకు రూ.10 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతుండగా చిలకలూరిపేట నేత మాత్రం తనకు రూ.6 వేలు చాలని చెబుతున్నట్లు సమాచారం. మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 150 కి తగ్గకుండా పాలీషింగ్ బండలు వితౌట్‌లో హైదరాబాద్‌కు తరలిపోతుండగా ఇందులో చిలకలూరిపేట, విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు 30 లారీలు, నరసరావుపేట, గురజాల మీదుగా 120 లారీలు వెళుతున్నట్లు సమాచారం. వీరంతా ప్రతి లారీకి కప్పం చెల్లించాల్సిందేనని బయ్యర్లకు హుకుం జారీ చేశారు. ఏఎమ్మార్ టోకెన్‌తో పాటు పచ్చనేతలకు ఇస్తున్న కప్పంతో కలుపుకుంటే ఒక్కో లారీకి రూ.58 వేలు ఖర్చు వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వానికి టాక్స్ చెల్లించినా ఇంత మొత్తంలో ఖర్చురాదు. దీంతో బయ్యర్లు పచ్చనేతలు చెప్పిన మొత్తాన్ని చెల్లించలేమంటూ అడ్డు తిరిగినట్లు సమాచారం. ఒకవేల ఏఎమ్మార్ టోకెన్‌కు చెల్లించే మొత్తాన్ని రద్దు చేయిస్తే పచ్చనేతలు అడిగిన మేరకు కప్పం చెల్లిస్తామని బయ్యర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.



క్లుప్తంగా

వాహనాల తనిఖీ



రేపల్లె రూరల్: సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించేందుకు పోలీస్ శాఖ నిఘా పెంచిందని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రధాన సెంటర్లలో వాహనాలు తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనచోదకులు తమ వెంట వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌లు చేయించుకోవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని సూచించారు. వాహనాలలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయరాదన్నారు. నిత్యం తనిఖీలు ఉంటాయని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతోపాటు, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్ తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై బెంగళూరులో 35 రోజులపాటు ఉచిత భోజన, వసతితో శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరుశాతం ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



అద్దంకి రూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన అద్దంకి మండలంలోని చిన కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి భార్య పులి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవితేజ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన పులి నెహేమియా (35) 15 సంవత్సరాలుగా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామాంజనేయులు రైస్ మిల్లుకు కరెంట్ రాకపోవడంతో చూడటానికి వెళ్లాడు విద్యుత్ స్తంభం ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలటంతో పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు రామాంజనేయులు, తంగిరాల మనోహర్‌లు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

వక్ఫ్ బోర్డు ముస్లింల హక్కు



నకరికల్లులోని వై.జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు



సత్తెనపల్లిలో ర్యాలీ

- బిల్లును నిరసిస్తూ నిరసన
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- జాతీయ రహదారిపై కదం తొక్కిన ముస్లింలు
- సత్తెనపల్లి చెక్‌పోస్ట్ నుంచి బస్టాండ్ వరకు భారీ శాంతి ర్యాలీ

నకరికల్లు: ముస్లింల హక్కు అయిన వక్ఫ్ బోర్డును విచ్ఛిన్నం చేసే బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ జాతీయ జెండాలు, నల్ల జెండాలతో ముస్లింలు శుక్రవారం నకరికల్లులో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక వై.జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని గుండ్లపల్లి, నకరికల్లు, కుంకలగుంట తదితర గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ముస్లింలు స్వచ్ఛందంగా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వక్ఫ్ బిల్లుకు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా గుండ్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ముస్లిం పెద్దలు, అప్పటి రాజులు దానంగా, ధర్మంగా ఇచ్చిన కోట్ల విలువ కలిగిన ఆస్తులకు 1913లో ఒక చట్టంతో నేటి వరకు రక్షణ కల్పించుకున్నట్లు తెలిపారు. ముస్లింల రక్షణ పేరుతో దుర్మార్గమైన చట్టాన్ని అర్ధరాత్రి కేంద్రం అమల్లోకి తీసుకు వచ్చిందని విమర్శించారు. ముస్లింలకు అన్యాయం చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. పలువురు ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ముస్లింలకు అనాదిగా వస్తున్న హక్కు అన్నారు. యావత్ ముస్లింలు వ్యతిరేకిస్తున్న దుర్మార్గపు బిల్లును కేంద్రం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లును వెనక్కు తీసుకునే వరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి ఫకీర్ అహ్మద్, కరాలపాటి వలి, వినుకొండ సుభాని, కరిముల్లా, మస్తాన్‌వలి, షేక్ సలీల్, బండల జాను, షేక్ బాజి, ఇస్మాయిల్, జానీ బాషా, న్యాయవాది జిలాని, ఖాజావలి, రహమాన్, చాంద్ బాషా, మొహమ్మదా, సైదా, కాలేషా పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా ఇటీవల తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు వ్యతిరేకంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో భారీ శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మైనార్టీ హక్కులకు భంగం కలిగించేలా ఉన్న ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ఖండించారు. నూతన చట్టంలో వక్ఫ్ నిర్వచనాన్ని మార్చారని తెలిపారు. కొన్ని శతాబ్దాలుగా ఉన్న మసీదులు, ముస్లిం శ్మశాన వాటికలు, దర్గాలు, ముస్లిం మత ప్రదేశాలన్నీ కూడా ఎలాంటి డీడ్స్ లేకపోయినా వక్ఫ్ బోర్డుల పరిధిలో కొనసాగుతూ ఆస్తులుగా ఉన్నాయని వివరించారు. నూతన చట్టం ప్రకారం వాటన్నిటిపై బోర్డుకున్న హక్కు తొలగి పోతుందని, దీని ద్వారా ఆస్తుల స్వాధీనం లేదా పునర్ వర్గీకరణకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీంతో లెక్కలేనన్ని చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకంగా నిలిచే ప్రదేశాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన చట్టంలో వక్ఫ్ బోర్డు సీఈవోగా ముస్లిం వ్యక్తే ఉండాలన్న నిబంధనను తొలగించడంతో పాటు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఇవి తమ హక్కులకు భంగం కలిగించడమేనని, మతాల మధ్య సామరస్యాన్ని దెబ్బ తీయటమేనని ధ్వజమెత్తారు. ముస్లింల ప్రాథమిక హక్కుల కల్పనకు వ్యతిరేకంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టంలో చేసిన 14 సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని, మైనార్టీలపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ, ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి.. వక్ఫ్ పరిరక్షణకు ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సత్తెనపల్లిలోని జాతీయ రహదారిపై కదం తొక్కిన ముస్లింలు నరసరావుపేట రోడ్‌లోని చెక్ పోస్ట్ సమీపంలో గల మసీదు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. తిరిగి తాలూకా సెంటర్‌కు చేరుకొని అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కె.ఎస్. చక్రవర్తికి వినతి పత్రాన్ని అందించారు. ముస్లింల శాంతి నిరసన ర్యాలీకి న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ముస్లింలు, మత పెద్దలు, పార్టీలకు అతీతంగా ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త రిమాండ్ రిపోర్ట్‌ను తోసిపుచ్చిన కోర్టు

- పోలీసుల అభ్యర్థనను తిరస్కరించిన న్యాయమూర్తి

వినుకొండ: పోలీసులు దాఖలు చేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గోలి లక్ష్మణరావు రిమాండ్ రిపోర్ట్‌ను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి తిరస్కరించారు. రెండు రోజుల కిందట ఈపూరు మండలం కొచ్చర్లలో జరిగిన ఘర్షణలో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి లక్ష్మణరావు రిమాండ్‌ను కోరారు. ఆయన తరఫున వినుకొండ ప్రముఖ న్యాయవాది, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్. ప్రసాద్ వాదనలు వినిపించారు. ఆయనతో పాటు వినుకొండ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు జి. హరిప్రసాదరావు, కోపెల దేవరాజు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వై.చిరంజీవి, టి. శ్రీనివాసరావు హాజరయ్యారు. గతంలో ఇదే మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని విమర్శించాడని కొండావర్జు నాగేశ్వరరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వెంటనే హైకోర్టులో కేసు వేయడంతో పోలీసులు విడుదల చేశారు. అదే కోవలో జరిగిన కేసులో ఈ సందర్భంగా లక్ష్మణరావు తరఫున ఎం.ఎస్.ప్రసాద్ వాదనలు వినిపించారు. ఈపూరు పోలీసులు కేసు అండ్ కౌంటర్‌గా రెండు కేసులు రిజిస్టర్ చేశారని, అందులో వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు 85 సంవత్సరాల వృద్ధ మహిళ బుచ్చమ్మ మోకాలు విరగ్గొట్టిన అధికార టీడీపీ వ్యక్తులను అరెస్ట్ చేయకుండా దానికి సంబంధించి సెక్షన్ 118(2) కాకుండా 118(1) వేయటాన్ని తప్పుపట్టారు. ఏడు సంవత్సరాల లోపు శిక్షా కాలం ఉన్న నేరంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద నోటీస్ ఇవ్వకుండా రిమాండ్‌కు గోలి లక్ష్మణరావును తీసుకురావడంపై అభ్యంతరం తెలిపారు. కొచ్చర్ల గ్రామంలో రాళ్లు విసిరి, కర్రలతో దాడి చేసిన అధికార టీడీపీ వ్యక్తులను యథేచ్ఛగా గ్రామంలో వదిలేసి లక్ష్మణరావును కోర్టుకు తీసుకువచ్చిన రిమాండ్ అడగడం పోలీసుల పక్షపాత వైఖరికి అద్దం పడుతోందని తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం పోలీసులు రిమాండ్ కోరడం చట్టప్రకారం చెల్లదని వాదనలు వినిపించారు. ఈపూరు ఎస్ఐ రాజ్యాంగం ప్రకారం కాకుండా అధికార పార్టీ సూచనల మేరకు నడుచుకుంటున్నారని, తన సొంత చట్టాలను అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బెయిల్ పిటిషన్ కోసం జరిగిన వాదనలు అనంతరం జూనియర్ సివిల్ జడ్జి డిఫెన్స్ వారి వాదనలను తీసుకొని, పోలీసులు తీసుకొచ్చిన రిమాండ్ చెల్లదని, లక్ష్మణరావును విడుదల చేస్తూ ఆదేశించారు.

పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అధ్వానం

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అధ్వానంగా ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చేస్తున్న దుర్మార్గాన్ని న్యాయస్థానాల ద్వారా పోరాడి బాధితులకు న్యాయం చేస్తామని, పోలీసులు గుర్తుంచుకోవాలని చెప్పారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, పోలీసులు ప్రజలకు న్యాయం చేసేలాగా ఉండాలని, అంతేగానీ ప్రభుత్వానికి ఊడిగం చేసేలా ఉండకూడదని హితవు పలికారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

కాకుమాను: ఈ ఏడాది పొగాకు సాగు చేస్తున్న రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పెదనందిపాడులో రైతులు పండించిన పొగాకును కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ధర సగానికి సగం తగ్గిందని ఆవేదన చెందారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల కష్టాలు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించిందని కనీసం రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల నుంచి పంటను రూ.18వేలకు కొనాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు గంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటశివరావు, దొప్పలపూడి రమేష్ బాబు పాల్గొన్నారు.



పెదనందిపాడులో పొగాకును పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

గుంటూరులో అర్ధరాత్రి ఐజీ, ఎస్పీ తనిఖీలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట నాలుగో లైన్‌లో గురువారం అర్ధరాత్రి గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ, ఎస్పీ సతీష్ కుమార్, వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ తదితర పోలీసు అధికారులు ఆకస్మికంగా పర్యటించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు అమలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, బహిరంగ మద్యపానం తదితర కార్యకలాపాలను అరికట్టడానికి తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు భరోసా కల్పించేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్

క్రీస్తు శ్రమలతో పాపాల నుంచి విముక్తి

- విశ్వాసులతో కిక్కిరిసిన మందిరాలు
- కళ్లకు కట్టినట్లుగా క్రీస్తు సిలువ యాత్ర సన్నివేశాలు
- సిలువపై ప్రభువు పలికిన సందేశాలు మార్గదర్శకాలు
- దైవ, మానవ ప్రేమను గుడ్ ఫ్రైడే చాటుతుందంటూ పాస్టర్లు బోధనలు

యడ్లపాడు: గుడ్ ఫ్రైడే సందర్భంగా యడ్లపాడు ఆర్సీఎం చర్చి జనాలతో కిక్కిరిసిపోయింది. ఆర్సీఎం చర్చి ఫాదర్ కొడవటి సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో కలువరి శిలువ యాత్రను నిర్వహించారు. ముందుగా లింగారావుపాలెం, మైదవోలు, జాలాది, ఉప్పరపాలెం గ్రామాల నుంచి క్రైస్తవులు పాదయాత్రగా యడ్లపాడులోని ఆర్సీఎం చర్చి వద్దకు చేరుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు భారీ సిలువతో యాత్ర ప్రారంభమైంది. ఆర్సీఎం చర్చి ఆధ్వర్యాన వేలాది మంది విశ్వాసులతో స్తుతి గీతాలు పాడుకుంటూ క్రీస్తు శ్రమలను కళ్లకు కట్టిన చూపుతూ కల్వరి సిలువ యాత్ర ఘనంగా ప్రారంభమైంది.

14 దివ్య స్థలాల ప్రాముఖ్యతను తెలిపిన యాత్ర

దిగువపల్లె (ఎస్సీ కాలనీ)లోని ఆర్సీఎం చర్చిలో వేలాది మంది విశ్వాసులతో ప్రారంభమై, గ్రామ వీధుల మీదుగా, హైవే సర్వీసు రోడ్డున సాగుతూ ఎరక్రొండ వరకు సిలువ యాత్ర కొనసాగింది. యాత్ర మధ్యలో 14 దివ్య స్థలాల వద్ద ఆగింది. ఆయా స్థలాల ప్రాముఖ్యతను ఫాదర్ సుభాష్ చంద్రబోస్ వివరించారు. పరుల పాపాలను కడిగివేసేందుకు ఏసుప్రభు సిలువ నెక్కిన రోజు శుభ శుక్రవారమని, ఇది క్రైస్తవ సమాజానికి ఎంతో శుభదినమని చెప్పారు. ఏసు ప్రభువు తన రక్తాన్ని సిలువపై చిందించి పాపాల నుంచి సర్వమానవుల్ని విముక్తి కల్పించారన్నారు.

కళ్లకు కట్టినట్లు ఏసుప్రభువు శ్రమలు

కల్వరి సిలువ యాత్రలో విప్పర్ల రమేష్(ఏసుక్రీస్తు), కారుచోల మల్లేశ్వరీ (మేరిమాత) క్రీస్తు పడిన శ్రమను ప్రత్యక్షంగా చూపిస్తూ జన హృదయాలను కదిలించారు. ఎడ్లూరి సంజీవరావు, బందెల మహేష్, బాలతోటి శౌరి, జోజయ్య, విప్పర్ల యోబు తదితరులు మిగతా పాత్రలను పోషించి యాత్రకు మరింత జీవం పోశారు. దీంతో భక్తులు క్రీస్తు నాడు పడిన కష్టాలను చూసి కన్నీళ్లతో ప్రార్థనలు చేశారు. యానిమేటర్ కారుచోల నాగేశ్వరరావు, ఎం. శ్యాం పర్యవేక్షణలో ఈ కార్యక్రమంలో జరిగింది. ఆద్యంతం సువార్త గీతాల ఆలాపనతో హైవే పక్కనే ఉన్న రహదారి మాత పుణ్యక్షేత్రానికి క్రైస్తవులు చేరుకుని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉపాధి హామీ కూలీ మృతి



బల్లికురవ: ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా ఎండ వేడిమితో అనారోగ్యం పాలై పదిరోజులపాటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అందిన సమాచారం ప్రకారం.. మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు (45) పదిరోజుల కిందట గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. రెక్కాడితేకాని డొక్క నిండని ఈ కుటుంబంలో యజమాని చనిపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు అకాల మరణంతో కొండాయపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాల వ్యాన్ బోల్తా: వ్యక్తికి గాయాలు

జె.పంగులూరు: సురభి డెయిరీకి చెందిన పాల వ్యాను శుక్రవారం ఉదయం మండలంలోని చందలూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో బోల్తా పడింది. మండలంలోని జాగర్లమూడి వారి పాలెం వద్ద గల సురభి డెయిరీ నుంచి వాహనం పాల పదార్థాలతో చందలూరు మీదుగా చీరాల వెళ్లేందుకు బయలుదేరింది. తూర్పు కొప్పెరపాడు దాటిన తర్వాత ఎదురుగా కారు వచ్చింది. అది వెళ్లేందుకు దారి ఇస్తూ పక్కకు రావడంతో వ్యాన్ అదుపు తప్పి మార్జిన్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో పాల వాహనంలో ఉన్న ఎస్. కళ్యాణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో అతన్ని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రోడ్డు పక్కన బోల్తా పడిన సురభి డెయిరీ పాల వాహనం

70 గ్రాముల బంగారం చోరీ

కాజ(మంగళగిరి): కాజ రామాలయం సెంటర్‌లో చోరీ ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాజ రామాలయం సెంటర్‌లో ఉంటున్న ఆర్దల నిర్మల కుమారుడు, కుమార్తెలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. నిర్మల 15 రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లింది. గురువారం సాయంత్రం ఇంటి పక్కన ఉన్న వారు చూడగా తలుపులు తీసి ఉండటంతో హైదరాబాద్ ఫోన్ చేసి నిర్మలకు సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం హైదరాబాద్ నుంచి కాజ చేరుకుని ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అందులోని బంగారం బిస్కెట్లు ఐదు, కొన్ని బంగారు వస్తువులు కలిపి మొత్తం 70 గ్రాములు బంగారం చోరీకి గురైందని తెలుసుకున్నారు. రూరల్ స్టేషన్‌కు చేరుకుని నిర్మల ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హాస్య నట మాంత్రికుడు షఫీ ఉజ్మా

- కందుకూరి పురస్కారం అందుకున్న షఫీ నట ప్రస్థానం
- రంగస్థల హాస్య నాటికల దర్శక, నటుడిగా కీర్తి
- స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన నాటికలకు ప్రశంసల జల్లులు
- ఆలీతో సరదా నాటిక రాష్ట్రవ్యాప్తంగా 74 చోట్ల ప్రదర్శనలు
- మే 1న చిలకలూరిపేటలో 75వ ప్రదర్శనకు సన్నాహాలు

చిలకలూరిపేట: నవరసాలలో కష్టమైనది హాస్య రసం. దాన్ని తన సహజ నటనతో ప్రేక్షకుల మోముల్లో నవ్వుల పువ్వుల్ని అవలీలగా పూయించగల విలక్షణ నటుడు షేక్ షఫీ ఉజ్మా. కామెడీ నాటకాలంటే ముందుగా గుర్తొచ్చేది షఫీనే. ఆయన రంగస్థల కళాకారుడే కాదు దర్శకుడు కూడా. చిలకలూరిపేట పట్టణానికి చెందిన షఫీ నాటకరంగంలో తన జీవితాన్ని హాస్య భూమికగా మలుచుకున్నాడు. పట్టణానికి చెందిన అబ్దుల్‌రజాక్, నజీమున్నీసా దంపతుల కుమారుడైన షఫీ తన హాస్య నాటికల ద్వారా తెలుగు నాటక రంగాన్ని వినోదభరితంగా తీర్చిదిద్దాడు. ప్రతి నాటికలోనూ హాస్యాన్ని ఓ సామాజిక సందేశంగా మార్చిన షఫీ, ప్రేక్షకులను కేవలం నవ్వించడం, అలరించడమేకాదు..ఆ హుతుల్ని ఆలోచింపజేస్తుంది అతని నటన. షఫీ నటించిన ప్రతి పాత్ర, ప్రతి సంభాషణలోనూ విశేషమైన స్వాభావికత్వం, చిరునవ్వు పండించే మాంత్రికతత్వం సహజంగా ఉంటుంది. కాబట్టే తాజాగా ప్రభుత్వం ప్రకటించిన కందుకూరి జిల్లా పురస్కారాన్ని గర్వంగా అందుకున్నాడు.

స్వీయ దర్శకత్వంతో పాటు నటించిన నాటికలివే...

తొలి నాటిక ఛాన్స్ నుంచి మొదలైన షఫీ కళా పయనం వాయిదాల పెళ్లి, కాకి సందేశం, హ్యాచ్ , వడ్లగింజలో బియ్యపు గింజ, నల్లకోడి తెల్ల గుడ్డు , పోవోయి అనుకోని అతిథి, అక్క అలుగుడు చెల్లి సణుగుడు , ఆలీతో సరదాగా, హర్షం ఋతువు, ప్రేమ పొత్తిళ్లలోకి, హరిశ్చంద్రుడే అబద్ధమాడితే! , వర్క్ ఫ్రం హోమ్, ఏడనున్నాడో ఎక్కడున్నాడో, వాస్తు బాబోయ్ వాస్తు, తగునా ఇది భామా, భూమి గుండ్రంగా ఉంది, నిజాయితీ, బావా బావా పన్నీరు వంటి హాస్య నాటికలన్నీ షఫీ నటించి, దర్శకత్వం వహించి విశేష ప్రాచుర్యం పొందినవే.

నటప్రస్థానానికి అందిన స్నేహహస్తం

షఫీ కళా ప్రయాణానికి తోడ్పడిన వారు ఉన్నారు. వారి స్ఫూర్తిదాయక మాటలతో పాటు ప్రముఖ హాస్య నాటక రచయిత అద్దేపల్లి భరత్‌కుమార్, కొత్త శివ, వంకాయలపాటి ప్రసాద్, ఆళ్ల హరిబాబు, అంబటి బాలస్వామి, వి. నాగేశ్వరరావు, నటీమణి లహరి సంపూర్ణ మద్దతు నిచ్చారు. దీనికి తోడు షఫీ నిబద్ధత, తోటి కళాకారులు సహకారం వెరసి ఆయన కలల సాధనకు ఎంతో దోహదపడ్డాయి.



రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి కందుకూరి జిల్లాస్థాయి పురస్కారం అందుకుంటున్న షేక్ షఫీఉజ్మా



రంగస్థల వేదికపై కళాకారుడిగా షఫీ

ఆ కళారూపం ఓ మైలురాయి

ఇక 'ఆలితో సరదాగా' నాటిక షఫీ నట ప్రస్థానానికి మైలురాయిగా నిలిచింది. ఆయన నాటికల్లో అత్యధిక ప్రదర్శనలకు నోచుకున్న నాటిక ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 74 పరిషత్తుల్లో ప్రదర్శనలు, ప్రశంసలకు నోచుకుంది. భిలాయ్, శ్రీకాళహస్తి, ఏలూరు, ద్రాక్షారామం, రావులపాలెం, విజయవాడ వంటి పది ప్రముఖ పరిషత్తుల్లో ఉత్తమ బహుమతుల్ని సాధించింది. ఇదే నాటిక తన జన్మస్థలంలో ఈ ఏడాది మే 18న తిరిగి 75వ ప్రదర్శనకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఒక నాటిక అనేక చోట్ల అనేకమార్లు ప్రదర్శనలకు నోచుకోవడం అంటే ఆషామాషీ కాదు.